

ఇఫ్తార్ కా 'ఆష్'
రంజాన్ మాసంలో కఠిన ఉపవాసదీక్షను అవలంబించే ముస్లింలు దీక్ష విరమణ సమయంలో అత్యంత ఇష్టంగా సేవించే పానీయం 'ఆష్' (గంజి)ని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. - 8లో



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం
రేణిగుంట-రైల్వేకోడూరు మార్గం రేణిగుంట మండలం కుక్కలదొడ్డి సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.84	రూ.104
రెండోరకం	రూ.50	రూ.82

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 205 మెట్రిక్ టన్నులు





కేంద్రీయం.. విద్యా సుగంధం


రాజంపేట వద్ద ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయం


రాయచోటిలో కేంద్రీయ విద్యాలయానికి సేకరించిన స్థలం

- అన్నమయ్య జిల్లాకు కేంద్రీయ విద్యాలయాలు మంజూరు
- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన
- ఇప్పటికే రాజంపేటలో ఒక కేంద్రీయ విద్యాలయం
- తాజాగా రాయచోటి, మదనపల్లెలకు మంజూరు
- ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్న తల్లిదండ్రులు, విద్యావేత్తలు

అన్నమయ్య జిల్లాలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలతో పాటు సాధారణ ప్రజలకు సంబంధించిన పిల్లలకు ఉత్తమ విద్య అందించే దిశగా అడుగులు పడుతున్నాయి. రాయచోటి, మదనపల్లెకు కేంద్రీయ విద్యాలయాలు మంజూరు కావడంపై ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్య అందుతుందనే ఆశాభావం తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది.

సాక్షి రాయచోటి : అన్నమయ్య జిల్లా చదువుల కోవెలగా మారుతోంది. ఇప్పటికే ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు ఉన్న జిల్లాగా అన్నమయ్యకు ప్రత్యేక గుర్తింపు ఉంది. హార్సిలీహిల్స్ వద్ద రిషివ్యాలీతోపాటు మరి కొన్ని పేరొందిన విద్యా సంస్థలు జిల్లాలో ఉన్నాయి. అంతేకాకుండా మరిన్ని విద్యా సంస్థలు కూడా వచ్చే అవకాశాలు కూడా లేకపోలేదు. రాజంపేటలో 2016లో కేంద్రీయ విద్యాలయాన్ని నెలకొల్పగా, తాజాగా మరో రెండు కేంద్రీయ విద్యాలయాలు జిల్లాకు మంజూరయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలతోపాటు మరికొంతమంది సాధారణ ప్రజలకు సంబంధించిన పిల్లలకు కూడా కేంద్రీయ విద్యాలయాల్లో చదువుకునే అవకాశాలు లభించనున్నాయి. ఇటీవల రాష్ట్రంలో తొమ్మిది కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా, అందులో అన్నమయ్య జిల్లాకు రెండింటిని కేటాయించడంతో అన్ని వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

విద్యకు పెద్దపీట
రాష్ట్ర ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్య పరంగా ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఒకవైపు పాఠశాలలను నాడు-నేడు కింద అద్భుతంగా తీర్చిదిద్దుతోంది. మరోవైపు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇంకోవైపు చదువును ప్రోత్సహిస్తూ విద్యార్థులకు అమ్మ ఒడి పథకం ద్వారా ప్రోత్సాహక నిధులను అందిస్తున్నారు. దీనికి తోడు టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి ప్రభుత్వం చరిత్ర సృష్టించింది. ఇలా చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ విద్యాదీవెన, వసతి దీవెన లాంటి పథకాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల గుండెల్లో ప్రత్యేక ముద్ర వేసుకున్నారు.

కేంద్రీయ విద్యాలయాలకు స్థలాల గుర్తింపు
అన్నమయ్య జిల్లాకు ప్రస్తుతం మంజూరైన రెండు ప్రతిష్టాత్మక కేంద్రీయ విద్యాలయాలకు స్థల సేకరణ కూడా పూర్తయింది. జిల్లా కేంద్రమైన రాయచోటిలో కేంద్రీయ విద్యాలయానికి సంబంధించి దిగువ అబ్బవరం ప్రాంతంలో ఐదు ఎకరాలను అధికారులు ఎంపిక చేశారు. అలాగే మదనపల్లె ప్రాంతం వలసపల్లె సమీపంలోని నవోదయ వద్ద ఐదు ఎకరాలను గుర్తించారు. ఈ ఎంపిక చేసిన స్థలాల్లోనే కేంద్రీయ విద్యాలయాల నిర్మాణాలకు సంబంధించి నివేదికలను పంపారు. ఈ ఏడాది విద్యా సంవత్సరంలోనే మదనపల్లెలోని గిరిజన బాలుర హాస్టల్‌లో తరగతులు ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జిల్లాలో రెండు కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుపై విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు స్వాగతిస్తున్నారు.

కేంద్రీయ విద్యాలయాల ద్వారా నాణ్యమైన విద్య



అన్నమయ్య జిల్లాకు సంబంధించి గతంలో ఒక కేంద్రీయ విద్యాలయం ఉండగా, ప్రస్తుతం రెండు మంజూరయ్యాయి. అందులో జిల్లా కేంద్రమైన రాయచోటితోపాటు మదనపల్లెలో ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైన స్థలాల ఎంపిక కూడా పూర్తయింది. ఒక్కో విద్యాలయానికి ఐదు ఎకరాలు చొప్పున స్థలాన్ని ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాము. ఈ ఏడాది మదనపల్లెలో అడ్మిషన్లు ప్రారంభించనున్నాం. కేంద్రీయ విద్యాలయాల ద్వారా నాణ్యమైన విద్య అందించడంతోపాటు ఆహ్లాదకర వాతావరణంలో చదువు కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నాం.
– గిరీషా పీఎస్, కలెక్టర్, అన్నమయ్య జిల్లా

ఏప్రిల్ 15న రాజంపేటలో మెగా జాబ్‌మేళా

రాజంపేట టౌన్ : వచ్చే నెల 15వ తేదీ రాజంపేటలో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తాము దాదాపు ఎనభై కంపెనీల ప్రతినిధులను ఇక్కడికి తీసుకొస్తున్నామన్నారు. జిల్లాలో పదివేల మందికి పైగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. విద్యార్హతను బట్టి నెలకు 15 వేల నుంచి 50 వేల రూపాయల వేతనంతో కూడిన ఉద్యోగాలను పొందవచ్చని తెలిపారు. క్యూఆర్ కోడ్ ద్వారా నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అందుకు సంబంధించిన వివరాలన్ని త్వరలో వెల్లడించనున్నట్లు తెలిపారు.

రామయ్య హుండీ ఆదాయం రూ. 6.59 లక్షలు

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి సంబంధించి మార్చి నెల హుండీ ఆదాయం రూ. 6 లక్షల, 59 వేల, 238 వచ్చింది. ఈ విషయాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయుడు తెలిపారు. ఈ సోమవారం ఆలయ రంగమండపంలో స్వామి వారి హుండీ ఆదాయాన్ని టీటీడీ సిబ్బంది లెక్కించారు.

ఎస్సెస్సీ బోర్డు వెబ్‌సైట్‌లో హాల్‌టిక్కెట్లు

రాయచోటి: ఎస్సెస్సీ-2023 పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను విద్యార్థులు నేరుగా ఎస్సెస్సీ బోర్డు వెబ్‌సైట్ బీఎస్‌సీ.ఏపీ.జీవోవి.ఇన్ నుంచి డౌన్ లోడ్ చేసుకుని పరీక్షకు హాజరుకావచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు. హాల్ టికెట్లపైన ప్రధానోపాధ్యాయుడి సంతకం, పాఠశాల సీలు అవసరం లేదని అన్నారు. కావున పదోతరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని వారు కోరారు.

న్యూస్‌రీల్

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

– జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి హుస్సేన్

లక్కిరెడ్డిపల్లి : ఏప్రిల్ నెలలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నమయ్య జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి హుస్సేన్ పేర్కొన్నారు. సోమవారం లక్కిరెడ్డిపల్లిలోని ఎస్సీ వన్, టు బాలుర వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం పిల్లలకు భోజనం వడ్డించాలని సూచించారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తే సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో చదివే విద్యార్థులు ట్రిపుల్ ఐటీ, ఇంటర్మీడియట్‌లో మంచి కళాశాలలో సీటు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూ శ్రీనివాసులు, రమేష్, సూర్యకాంతమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేషనల్ యూత్ వలంటీర్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ : భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్రం పరిధిలో నేషనల్ యూత్ వలంటీర్‌గా పనిచేసేందుకు ఆసక్తి గల యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువకేంద్రం కో-ఆర్డినేటర్ కె. మణికంఠం కోరారు. దరఖాస్తులను ఏప్రిల్ 3వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని సూచించారు. పదోతరగతి పాసై, 18 నుంచి 29 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారు అర్హులన్నారు. ఉద్యోగం చేస్తున్నవారు, చదువుతున్న వారు ఇందుకు అనర్హులు అన్నారు. ఇది కేవలం స్వచ్ఛంద సేవమాత్రమే, ఉద్యోగం కాదని పేర్కొన్నారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన వారు ఎన్‌వైకేఎస్.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికలు ఇంటర్వ్యూ ఆధారంగా నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు కడప నగరం బాలాజీనగర్‌లోని యూత్‌హాస్టల్‌లో, 08562-356303, 9533044233 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మహిళ నేత్రదానంతో ఇద్దరికి చూపు


మృతురాలి కుటుంబ సభ్యులనుంచి కార్నియాలను సేకరిస్తున్న నేత్రనిధి సిబ్బంది

పులివెందుల రూరల్ : మహిళ నేత్రదానం చేయడంతో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించిందని నేత్రనిధి అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురానికి చెందిన గంగమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ నేత్రనిధి అధ్యక్షుడు రాజుకు సమాచారం అందించారు. దీంతో రాజు సిబ్బందితో కలిసి మృతురాలి స్వగృహానికి వెళ్లి గంగమ్మ మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు.

పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం


ధ్వజారోహణం చేస్తున్న వేదపండితులు


గజవాహనంపై ఊరేగుతున్న పట్టాభిరాముడు

వాల్మీకిపురం : వాల్మీకిపురంలోని పట్టాభిరామస్వామి ఆలయంలో సోమవారం శోభకృత్‌నామ సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6గంటల నుంచి 7 గంటల మధ్య ధ్వజారోహణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి ఆగమ పండితులు మణికంఠ భట్టార్, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, టీటీడీ వేదపండితులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అర్చకుల వేద మంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపైకి అధిష్ఠింపజేశారు. ఈ సందర్భంగా నాగదోష, సంతాన ప్రాప్తి కోసం మహిళలకు కొడి ప్రసాదం పంపిణీ చేశారు. ఉదయం శ్రీ సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములవారి ఉత్సవమూర్తులను విశేష అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఊంజల్‌సేవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ మునిచెంగల్‌రాయులు, ఆలయ అధికారి కృష్ణమూర్తి, దిశంత్ కుమార్, నాగరాజు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గజవాహనంపై పట్టాభిరాముడు
బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు పట్టాభిరాముడు రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు గజవాహనంపై తిరుమాఢ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనం కల్పించారు. కోలాటాలు, చెక్కభజనలు, మంగళ వాయిద్యాల నడుమ పట్టాభిరామస్వామి గజవాహనంపై ఊరేగారు. వాహనాల ఎదుట మహిళలు పిండిదీపాలతో స్వాగతం పలికారు. భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొడుతూ... కర్పూర హారతులతో స్వామిని సేవించుకున్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు
బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయము త్యపుపందిరి వాహనం, సాయంత్రం ఊంజల్ సేవ, రా త్రి హనుమంత వాహనం సేవ నిర్వహించనున్నారు.

అన్నమయ్య జయంతి ఉత్సవాలపై ప్రత్యేక శ్రద్ధ

- అన్నమయ్య పేరుతో జిల్లా ఆవిర్భావం తర్వాత తొలి జయంతి ఉత్సవాలు
- వైభవంగా నిర్వహణకు టీటీడీ, జిల్లా యంత్రాంగం సన్నద్ధం
- మే 6 నుంచి 12 వరకు నిర్వహణ
- రాజంపేట ఎమ్మెల్యే మేడాతో పర్యాటక అధికారుల బృందం భేటీ


అన్నమయ్య జయంతి ఉత్సవాలపై ఎమ్మెల్యే మేడాతో చర్చిస్తున్న పర్యాటకశాఖ అధికారులు

రాజంపేట : పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 615వ జయంతి ఉత్సవాలపై జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ప్రత్యేక శ్రద్ధ వహించనున్నారు. అన్నమయ్య పేరుతో జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఉత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానం, జిల్లా యంత్రాంగం కలిసి కట్టుగా నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాజంపేటలోని మేడాభవన్‌లో శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డితో జిల్లా పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ రమణప్రసాద్, జిల్లా పర్యాటకశాఖాధికారి ఎం.నాగభూషణం భేటీ అయ్యారు. మే 6 నుంచి 12వరకు జయంతి ఉత్సవాలను టీటీడీ సహకారంతో వైభవోపేతంగా నిర్వహించాలని నిర్ణయించారు.

అన్నమయ్య విగ్రహం వద్ద..
అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం(అన్నమయ్య థీంపార్కు) వద్ద జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నారు. పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ రమణప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోందన్నారు. ఉదయం 9గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉత్సవాలను నిర్వహించాల్సి ఉందన్నారు. అన్నమయ్య సంకీర్తనలు, గోష్ఠిగానం, నాదస్వర సమ్మేళనం, శ్రీవారి కల్యాణం, కూచిపూడి, భరతనాట్యం, సాహిత సదస్సులు, వ్యాసరచన పోటీలు తదితర సంప్రదాయ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు.

స్పందన బాధితులకు సత్వర న్యాయం

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

రాయచోటి : స్పందన బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా జిల్లా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు సూచించారు. సోమవారం అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదేపదే పోలీసు స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండకూడదన్నారు. పోలీస్ అధికారులే స్వయంగా బాధితుల వద్దకు వెళ్లి విచారించి సకాలంలో చట్టపరిధిలో న్యాయం చేయాలన్నారు. స్పందన కార్యక్రమం ద్వారా వివిధ సమస్యలతో 63 మంది ఫిర్యాదుదారులు జిల్లా ఎస్పీని కలిసి వారి సమస్యలు విన్నవించుకున్నారు.

దివ్యాంగులకు ప్రభుత్వం చేయూత

- విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల స్కూటర్ల పంపిణీ
- జగనన్న వాహనమిత్ర పథకంలో భాగంగా. రూ.68 లక్షల వ్యయంతో 57 మందికి స్కూటర్లు
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్


విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల స్కూటర్‌లను అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్

రాయచోటి : దివ్యాంగులమని నిరుత్సాహపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ప్రత్యేక సహకారాన్ని, గుర్తింపును, చేయూతను అందిస్తోందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. సోమవారం రాయచోటిలోని కలెక్టరేట్ ఆవరణంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల స్కూటర్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, జేసీ తమీమ్ అన్సారియా, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు అందిస్తోందన్నారు. ఈసారి ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి జిల్లాలో మొదటిసారిగా 57 మందికి రూ.68 లక్షల ఖర్చుతో మోటొరైజ్డ్ స్కూటర్లను అందించడం హర్షించదగ్గ అంశం అన్నారు. అనంతరం శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కుల, మత, వర్గ రాజకీయ భేదాలు చూడకుండా అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అందించాలని ధ్యేయంగా సీఎం జగన్ పనిచేస్తున్నారన్నారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని వర్గాల వారికి మేలు చేస్తున్నారని చెప్పారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ దయ, కరుణ, మానవత్వానికి ప్రతీకగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మొదటిసారిగా మోటార్ సైకిల్ వానాలు అందజేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, వెలుగు సంస్థ వ్యవస్థాపకుడు ఉదయ్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కిశోర్ బాబు, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

అర్జీలకు త్వరితగతిన పరిష్కారం
స్పందన ద్వారా అందిస్తున్న ప్రజల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్‌ఓ సత్యనారాయణ, భూముల సర్వే విభాగం సహాయ సంచాలకుడు జయరాజ్ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు.

విజేతలకు కలెక్టర్ అభినందన
నేపాల్‌లోని ఖాట్మండులో జరిగిన సౌత్ ఏసియా చాంపియన్‌షిప్‌లో అన్నమయ్య జిల్లా విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో కలెక్టర్ గిరీషా పీఎస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌క్యూఏవై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా సెక్రటరీ షేక్ ఫాహీం, అండర్-18 బాలికల విభాగం విజేత పి.హిరణ్మయి, అండర్-14 విభాగం షేక్ రియాన్, ఎస్‌క్యూఏవై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ స్టేట్ చైర్మన్ ఇస్మాయిల్, జిల్లా ప్రెసిడెంట్ నరసింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేగవంతంగా ఇళ్ల నిర్మాణంపై దృష్టి
ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్న ఉద్దేశంతో ప్రతి మండలానికి రెండు సెంట్రింగ్ యూనిట్లు రుణం మంజూరు చేయాలని బ్యాంకర్లను కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో సెంట్రింగ్ యూనిట్స్, రుణ మంజూరు, పంచాయతీలు, వార్డుల్లో చలివేంద్రాల ఏర్పాటు, స్పందన, గృహనిర్మాణ పురోగతి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జేసీ తమీమ్ అన్సారియా, డీఆర్‌ఓ సత్యనారాయణ, భూముల సర్వే విభాగం ఏడీ జయరాజ్, హౌసింగ్ పీడీ శివయ్య, డ్వామా పీడీ మద్దిలేటి పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు
రాయచోటి అర్బన్ : ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణంలో ఆయన, జేసీ తమీమ్ అన్సారియాతో కలిసి చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో వైద్య సేవలు

– అత్యాధునిక 104 వాహనాలను ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే

రాయచోటిటౌన్ : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, శాసన సభ వ్యవహారాల సమన్వయకర్త, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం రెండు 104 వాహనాలను వీరు పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషాలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 104 ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు వేగంగా నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి అత్యాధునిక 108,104 అంబులెన్స్ వ్యవస్థ ప్రవేశ పెట్టారన్నారు. దీనికి ఆద్యుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, డీసీహెచ్ డాక్టర్ చంద్రశేఖర్, డీసీఎంఓ లోక వర్ధన్,104 జిల్లా అధికారి ఎస్. ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యం కేసు నమోదు

ములకలచెరువు : ములకలచెరువు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం బాలిక అదృశ్యం కేసు నమోదైంది. ఎస్‌ఐ డీవై స్వామి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం తాతన్నగారిపల్లెకు చెందిన మేకల రామాంజులు కుమార్తె(15) ములకలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. శనివారం ఎప్పటిలాగే స్కూల్‌కు బయల్దేరి వెళ్లింది. రాత్రి గడిచినా ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఊర్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. స్కూల్ హెచ్‌ఎం వద్దకు వెళ్లి విచారణ చేస్తే.. స్కూల్‌కు రాలేదని సమాధానం ఇచ్చారు. దీంతో మేకల రామాంజులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ లభిస్తే 9440900715 ఫోన్ నంబరుకు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

కలికిరి : మండల పరిధిలోని కలికిరి–కలకడ మార్గం పాళెం కురవపల్లి బస్టాప్ సమీపంలో ఈ నెల 22న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందాడు. ఎస్.ఎహసాన్(35) తిరుపతిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య షేక్ అమ్మాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెడ్‌కానిస్టేబుల్ కొండప్ప తెలిపారు.

ఇఫ్తార్ కా 'ఆష్'



గంజి పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

- ఉపవాస దీక్ష విరమణకు ప్రత్యేకంగా పంపిణీ
- పవిత్ర వంటకంగా భావిస్తున్న ముస్లింలు
- 28 ఏళ్లుగా పెద్దమసీదు వద్ద ఉచితంగా వితరణ

మదనపల్లె సిటీ : రంజాన్ మాసంలో కఠిన ఉపవాస దీక్షను అవలంబించే ముస్లింలు దీక్ష విరమణ సమయంలో అత్యంత ఇష్టంగా సేవించే పానీయం 'ఆష్' (గంజి). ఉపవాసదీక్ష పరులకు ఈ వంటకం చాలా ప్రత్యేకమైంది. స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద నున్న జామియా మసీదు వద్ద రోజూ పెద్ద గంగాళాల్లో వండించి, ఇఫ్తార్ సమయంలో ఉచితంగా పంపిణీ చేస్తారు. ఈ పానీయాన్ని ఆష్ అని పిలుస్తారు. ముస్లింలే కాకుండా అందరూ ఈ పానీయాన్ని ఇష్టపడతారు. ఇఫ్తార్ కోసం దీనిని పవిత్ర వంటకంగా భావించి ప్రతి ఒక్కరూ తీసుకునేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు. మదనపల్లెలోని జామియా మసీదు వద్ద గంజి పంపిణీ శుక్రవారం నుంచి ప్రారంభించారు.

పుణ్యకార్యం



ఉపవాసదీక్ష పరుల కోసం గంజి ఉచితంగా అందించడం పుణ్యకార్యం. దాదాపు 26 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. దాతల సహకారంలో నిర్వహిస్తున్నాం. రంజాన్ నెల ప్రారంభం నుంచి పండుగ వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది.

– రఫీక్‌బేగ్, మత పెద్ద, మదనపల్లె

ఇలా తయారు చేసుకోవచ్చు..

ముందుగా నెయ్యిని వేడి చేసుకుని దానిలో బొంబాయి రవ్వను వేయించుకుని చెక్క, లవంగాలు వంటివి వేసి రుచికరంగా తయారు చేస్తారు. పొంగుతున్న దశలో దించుకోవాలి. ఆష్‌ను వేడిగానే సేవించాలి. ఆష్‌ను సేవించడం వల్ల తక్షణం శక్తి వస్తుందని, జీర్ణక్రియ వేగవంతం అవుతుందని, ఆకలి పెరుగుతుందని పెద్దలు చెబుతారు. అందువల్లనే ఇఫ్తార్ సమయంలో ఖర్జురాలతోపాటు దీన్ని కూడా సేవిస్తారు.

28 ఏళ్లుగా ఉచితంగా పంపిణీ

రంజాన్ మాసం ప్రారంభం రోజు నుంచి ఉపవాసాలు పూర్తయ్యే వరకు గంజి పంపిణీ నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం మసీదు వద్ద ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు. సుమారు వెయ్యి మంది నుంచి 1500 మంది ఉపవాసదీక్షపరులకు ఉచితంగా గంజిని పంపిణీ చేస్తున్నారు. 28 ఏళ్లుగా ఈ కార్యక్రమం చేపడుతున్నారు.

వీరభద్రస్వామి హుండీ ఆదాయం లెక్కింపు



నగదు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

రాయచోటి టౌన్ : రాయచోటిలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఆలయ, బ్యాంక్ అధికారులు, పాలక మండలి సభ్యులు విద్యార్థులతో కలిసి లెక్కింపు చేపట్టారు. హుండీల ద్వారా రూ.32,51,090 వచ్చింది. నిత్యాన్నదానం కోసం ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.54,155 సమకూరింది. స్వామి, అమ్మవారికి భక్తులు 73 గ్రాముల బంగారు, 2.420 కిలోల ఆభరణాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డి, పాలక మండలి సభ్యులు నాగభూషణ్, రత్నశేఖర్‌రెడ్డి, సురేష్‌కుమార్, పి.భాస్కర్, నరసింహులు, జిల్లా దేవదాయశాఖ పర్యవేక్షణ అధికారి జనార్ధన్ పాల్గొన్నారు.

పల్లకీలో ఊరేగింపు : రాయచోటిలో భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామిని రాత్రి పల్లకీలో ఊరేగించారు. వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి రంగు రంగు పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. స్థానిక భక్తులతో పాటు కన్నడిగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో వసూళ్లపై విచారణ



సిబ్బందిని విచారణ చేస్తున్న వైద్యులు పాల్ రవికుమార్

మదనపల్లె : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మెటర్నరీ వార్డులో సిబ్బంది నగదు వసూళ్లపై సోమవారం ఈఎన్‌టీ వైద్యులు పాల్ రవికుమార్ విచారణ జరిపారు. వారంరోజుల క్రితం తంబళ్లపల్లె నియోజకవర్గం కోసువారిపల్లెకు చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ మహేశ్వర్‌రెడ్డి తన భార్య అరుణారెడ్డి ప్రసవ నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలో చేర్పిస్తే మెటర్నరీ వార్డులోని సిబ్బంది వైద్యసేవలకు తన వద్ద నగదు వసూలు చేశారని, పురిటిబిడ్డకు బొబ్బలు వస్తే వైద్య విషయంలో నిర్లక్ష్యం కనపరిచారని పత్రికాముఖంగా ఆరోపించారు. ఈ విషయమై పత్రికల్లో వార్తలు రావడంతో స్పందించిన ఎమ్మెల్యే నవాజ్‌బాషా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి మెటర్నరీ వార్డు సిబ్బంది వసూళ్లపై బాధితుడు మహేశ్వర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరపాల్సిందిగా వైద్యులు పాల్ రవికుమార్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో సోమవారం మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో పాల్ రవికుమార్ మెటర్నరీ వార్డు సిబ్బందిని వేర్వేరుగా, ఉమ్మడిగా విచారణ చేశారు. బాధితుల నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. విచారణ నివేదికలను మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలిదేవికి అందజేస్తానని, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- మృతులు అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరువాసులు
- వరుసకు అన్నదమ్ములు



షేక్ ఇబ్రహీం (ఫైల్) మహమ్మద్ ముషబర్ బాషా (ఫైల్)

రేణిగుంట (తిరుపతి జిల్లా): రేణిగుంట–రైల్వేకోడూరు మార్గం రేణిగుంట మండలం కుక్కలదొడ్డి సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు.

రేణిగుంట ఎస్‌ఐ ఈశ్వరయ్య కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు ఎంజీ రోడ్డుకు చెందిన షేక్ ఇబ్రహీం (21), షేక్ మహమ్మద్ ముషబర్ బాషా(30) వరుసకు అన్నదమ్ములు. ఎంజీ రోడ్డులో ఇబ్రహీం చెప్పుల దుకాణం, మహమ్మద్ ముషబర్ బాషా దుస్తుల దుకాణం నడుపుతున్నారు. మహమ్మద్ ముషబర్ బాషాకు వివాహమై ఏడాదిన్నర వయస్సు కలిగిన కుమారుడు ఉన్నాడు. ఇబ్రహీంకు ఇంకా వివాహం కాలేదు. సోదరులైన వీరిద్దరు ఆదివారం చెన్నైలోని తమ బంధువుల వద్ద ఓ మోటార్‌బైక్, సెల్‌ఫోను కొనుగోలు చేసేందుకు స్కూటర్‌పై ఆదివారం ఉదయం చెన్నైకి బయల్దేరారు. చెన్నైకి చేరుకుని అక్కడ బేరం కుదరకపోవడంతో కేవలం సెల్‌ఫోను మాత్రమే తీసుకుని ఆదివారం రాత్రి స్వస్థలానికి తిరుగు పయనమయ్యారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో రేణిగుంట మండలం కుక్కలదొడ్డి సమీపంలోని దర్గా వంతెన వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రేణిగుంట పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం తిరుపతి ఎస్‌వీ వైద్య కళాశాలకు తరలించారు. మృతుల బంధువులకు సమాచారం అందించడంతో వారు మార్చురీకి చేరుకుని బోరున విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఉపాధి కోసం వచ్చి.. కానరాని లోకాలకు..

రోడ్డు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్ వాసి దుర్మరణం



మృతి చెందిన రాజేష్

మదనపల్లె : ఉపాధి కోసం ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన ఓ యువకుడు కానరాని లోకాలకు వెళ్లిన సంఘటన చోటుచేసుకుంది. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్ వాసి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్‌లోని బల్లాపూర్ జిల్లా కుర్వపూర్వ గ్రామానికి చెందిన కాంతప్రసాద్ కుమారుడు రాజేష్(23) కొంత కాలం క్రితం పుంగనూరు మండలం ఈడిగపల్లె వద్ద ఉన్న రైస్‌మిల్లులో ఉపాధి కోసం వచ్చాడు. ఇతను ఆదివారం రాత్రి పుంగనూరుకు ద్విచక్రవాహనంలో వెళ్లాడు. తిరిగి వచ్చేటప్పుడు భీమగానిపల్లె వద్ద రోడ్డుపై ఏర్పడ్డ గుంతలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజేష్‌ను స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలోని ఐసీయూలో చికిత్సలు పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మార్చురీకి తరలించారు. పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం

తల్లీకొడుకులు పెట్రోల్ బాటిల్‌తో..



తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ బాటిళ్లతో కనకమ్మ, హరిబాబు

పెద్దతిప్పసముద్రం : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట తల్లీకొడుకులు బొంతల కనకమ్మ, హరిబాబు సోమవారం ఆత్మహత్యకు ప్రయత్నించారు. వారి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పులికల్లు పంచాయతీ బొంతలవారిపల్లికి చెందిన హరిబాబుకు తమ పూర్వీకులకు సంక్రమించిన ఐదు సర్వే నంబర్లలో మొత్తం రూ.8.22 ఎకరాల భూమి ఉండగా, ఆస్తికి వారసులైన ముగ్గురిలో ఒక్కొక్కరికి 2.74 ఎకరాల భూమి భాగ పరిష్కారం చేసుకున్నారు. వీరిలో ఏడాది క్రితమే ఇద్దరికి పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు కాగా తాను గతేడాది జూన్ నుంచి మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకున్నా ఇంత వరకు అతీగతీ లేకుండా పోయిందని హరిబాబు వాపోయారు. సీఎం క్యాంపు కార్యాలయానికి, రాయచోటిలోని కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో తన గోడు వెళ్లబోసుకున్నా ఫలితం లేదన్నారు. తన కుమారుడు శ్రీధర్‌రెడ్డి బెంగళూరులో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతూ ఫీజులు కట్టలేదనే కారణంతో అర్ధాంతరంగా ఇంటికి వచ్చేశాడని, తమ భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే బ్యాంకులో పంట రుణం పొంది ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ విద్యాసాగర్ బాధితులతో చర్చించి సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదన్నారు. అనంతరం తహసీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ బాధితులు మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసిన విషయం తనకు తెలిసినా భూ రీసర్వే ఆరంభం నుంచి అడిషన్ ఆఫ్ సర్వే నంబర్ ఆప్షన్‌ను రాష్ట్ర వ్యాప్తంగా నిలుపుదల చేయడంతో తామేం చేయలేమన్నారు. అయితే సదరు భూమి వారి పూర్వీకుల నుంచి ఇప్పటి వంశీకులకు ఎలా సంక్రమించిందో సంబంధిత పత్రాలు, ఈసీ జతపరచి బాధితులు సమగ్ర విచారణకు సహకరిస్తే తాము వివరాలను జాయింట్ కలెక్టర్ లాగిన్‌కు పంపిన అనంతరం సదరు రైతు సమస్యను పరిష్కరించవచ్చని ఆయన స్పష్టం చేశారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య



యేసోబు మృతదేహం

ఓబులవారిపల్లె : మండలంలోని మంగంపేట పునరావాస కాలనీ 9వ వీధికి చెందిన కె. యేసోబు(45) జీవితంపై విరక్తి చెంది సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. డ్రైవర్‌గా పని చేస్తున్న యేసోబు మద్యానికి బానిసయ్యాడు. వచ్చే నగదు కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా కలత చెందాడు. సోమవారం ఉదయం కొర్లకుంట రైల్వేట్రాక్ సమీపంలో ఎడమచేయి మణికట్టు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన ఊపిరితో ఉన్న అతను తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని, కొర్లకుంట రైల్వేట్రాక్ సమీపంలో ఉన్నానని చివరిసారిగా మాట్లాడటం కోసం ఫోన్ చేశానని తెలిపాడు. వెంటనే కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా రక్తపు మడుగులో ఉన్న యేసోబును రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రామచంద్రయ్య తెలిపారు.

కుక్క అడ్డు రావడంతో..

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు



గాయపడిన శివ

మదనపల్లె : కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి వ్యక్తి గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి ములకలచెరువు మండలంలో జరిగింది. తంబళ్లపల్లె మండలం మట్లివారిపల్లెకు చెందిన శివ(38) కొంత కాలంగా మదనపల్లె పట్టణ శివారులోని చంద్రాకాలనీలో ఉంటూ ఇటుక బట్టీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో బెంగళూరుకు బయలుదేరాడు. మార్గంమధ్యలో కంటేవారిపల్లె కనికలతోపు వద్ద రోడ్డుకు అడ్డుగా కుక్క రావడంతో దాన్ని తప్పించబోయి వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అతను గాయపడ్డాడు. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చెట్టుపై నుంచి పడి..

చెట్టుపై నుంచి పడి ఓ రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం పీటీఎం మండలంలో జరిగింది. మండలంలోని బూచిపల్లెకు చెందిన శ్రీనివాసులు(48) వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం పొలం వద్ద చింత చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా, కొమ్మ విరగడంతో పట్టుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు.

రేషన్ బియ్యం స్వాధీనం : యువకుడి అరెస్ట్

మదనపల్లె : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకుని ఓ యువకుడిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఎగువ కురవంకకు చెందిన దస్తగిరి కుమారుడు అంజద్‌బాషా(29) ఆదివారం రాత్రి ఆటోలో 15 బస్తాల రేషన్‌బియ్యాన్ని కర్ణాటకకు తరలిస్తుండగా, నక్కలదిన్నె ఆర్చి వద్ద పట్టుకున్నామన్నారు. వాహనంతో సహా బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె : భర్త వేధింపులపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలోని రామిరెడ్డి లేఅవుట్‌కు చెందిన గోపాల కృష్ణారెడ్డి, కళావతి దంపతులు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గోపాలకృష్ణారెడ్డి ఇటీవల ఎక్కువగా అప్పులు చేశాడు. అప్పులు తీర్చేందుకు కళావతి పేరుపై ఉన్న స్థలం అమ్మి డబ్బు ఇవ్వాలంటూ వేధించడం మొదలుపెట్టాడు. ఈ విషయమై కొద్దిరోజులుగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆమె సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

వివాహిత ఆత్మహత్య

మదనపల్లె : ఆర్థిక ఇబ్బందుల కారణంగా వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని కోళ్లబైలు పంచాయతీ బాబుకాలనీకి చెందిన గంగయ్య భార్య ప్రమీల(49) సోమవారం రాత్రి ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ప్రమీల భర్త కదిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నాడు. ప్రమీల టైలరింగ్ పని చేస్తోంది. వీరికి మనోహర్, మధు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారికి వివాహాలై స్థిరపడ్డారు. అయితే కుమారుల వివాహాల కోసం, కుటుంబ పోషణ నిమిత్తం ప్రమీల పలువురి వద్ద అప్పులు చేసింది. ఈ విషయమై అప్పులవారు డబ్బు చెల్లించాలని ఒత్తిడి తెచ్చారు. చేసిన అప్పులు సకాలంలో చెల్లించలేక తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె రాత్రి ఇంటిమిద్దెపై ఉన్న గదిలోకి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మిద్దెపైకి వెళ్లిన ప్రమీల ఎంతసేపటికీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూశారు. అప్పటికే ఆమె చీరతో ఉరి వేసుకుని వేలాడుతుండటంతో కుటుంబ సభ్యులు గట్టిగా కేకలు వేశారు. దీంతో చుట్టుపక్కలవారు గమనించి ఆత్మహత్య సమాచారం తాలూకా పోలీసులకు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

రెడ్డివారికుంట కబ్జా

కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు

ఓబులవారిపల్లె : మండలంలోని పెద్దఓరంపాడు రెవెన్యూ పరిధిలోని రెడ్డివారికుంటను దర్జాగా కబ్జా చేస్తున్నారు. దీనిని అరికట్టాలని పెద్దఓరంపాడు గ్రామ రైతులు సోమవారం రాయచోటిలో కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. కుంటలో కొంత మంది కట్టడాలు కట్టి, ప్లాట్‌లుగా చదును చేసి విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారని వారు పేర్కొన్నారు. గ్రామంలోని పశువులు నీరు తాగడానికి, ఇతర అవసరాలకు కుంటలోని నీరు ఉపయోగ పడుతుందన్నారు. కావున ఆక్రమణలను తొలగించాలని కోరారు.

అచ్చెన్న మృతిపై సమగ్ర విచారణ జరపాలి



ఎస్పీతో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ

రామాపురం/రాయచోటి అర్బన్ : వైఎస్సార్ జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ అచ్చెన్న మృతిపై సమగ్ర విచారణ జరపాలని పలువురు డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రామాపురం మండలంలోని గువ్వలచెరువు ఘాట్ ప్రాంతంలో అచ్చెన్న మృతదేహం లభించిన ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. అనంతరం సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యుడు జి.ఈశ్వరయ్యతో కలిసి రాయచోటిలోని జిల్లా ఎస్పీ హర్షవర్దన్‌రాజును ఆయన కార్యాలయంలో కలిశారు. హంతకులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. హత్యకు పరోక్షంగా సహకరించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్రనేతలు నరేంద్ర మాదిగ, రామాంజనేయులు, శివయ్య, అన్నమయ్య జిల్లా ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు బండకింద మనోహర్, కడప జిల్లా కన్వీనర్ వెంకటేష్, ఎంఆర్‌పీఎస్ నేతలు ఆందన్, మహదేవ, నాగేంద్ర, నరసింహులు, రామా ంజులు, ఎంఈఎఫ్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు మాట్లాడుతూ అచ్చెన్న మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విష్ణుప్రీతం రెడ్డి, శ్యామలాదేవి, మామిళ్ళ బాబు, ఆనంద్, సూర్యుడు తదితరులు పాల్గొన్నారు.

కడప కోటిరెడ్డి సర్కిల్: రాయలసీమ ప్రజా సంఘాల జేఏసీ నాయకులు వి.రమణ, అవ్వారు మల్లికార్జున, సంగటి మనోహర్ జిల్లా కలెక్టర్ విజయ్ రామరాజును కలిసి వినతి పత్రం సమర్పించారు.

విషాదకరం

కడప అగ్రికల్చర్ : కడప బహుళార్థ పశు వైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ అచ్చెన్న మృతి విషాదకరం అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశుసంవర్ధశాఖ డైరెక్టర్ అమరేంద్ర అన్నారు. సోమవారం సాయంత్రం కడప వీసీపీని జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి శారదమ్మతో కలిసి సందర్శించి అచ్చెన్న మృతికి తమ సంతాపాన్ని తెలిపి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడ జరుగుతున్న పరిణామాలపై వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ, కడప డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమణయ్య, ఐఎస్‌డీపీ ఏడీ డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ ప్రమోద్, డాక్టర్ శివరామిరెడ్డి, ఏపీవీఏఎస్ఎస్ఏ ప్రెసిడెంట్ డాక్టర్ నేతాజీ, సెక్రటరీ రాజశేఖర్, ఏపీఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

నేడు త్రిసభ్య కమిటీ రాక

కడప అగ్రికల్చర్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం కడపలోని బహుళార్థ పశువైద్యశాలకు(వీపీసీ) పశుసంవర్ధకశాఖ అడిషినల్ డైరెక్టర్‌తో కలిసి త్రిసభ్య కమిటీ వస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ తెలిపారు. ఈ కమిటీ ఇక్కడ పరిస్థితులపై ఆరా తీయనున్నట్లు పేర్కొన్నారు.